క్లుప్తంగా

చురుగ్గా ఉపాధి హామీ పనులు


మర్రితిప్పలో పంట బోదెను తవ్వుతున్న కూలీలు

నరసాపురం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు ఊపందుకున్నాయి. మంగళవారం నరసాపురం మండలంలో 90 గ్రూపులకు చెందిన 2700 మంది 28 గ్రామాల్లో పనులు చేశారని ఎంపీడీఓ ఎం వెంకట రమణారావు తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా కాలువలు, చెరువు తవ్వకం, పూడికతీత తదితర పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు.

చురుగ్గా పంటబోదె తవ్వకం పనులు


మోడి గ్రామంలో పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: మండలంలోని పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. కేపీ పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, మొగల్తూరు పంచాయతీ నక్కావారిపేట, ఇంజేటివారిపాలెం, పడమటిపాలెం, నల్లంవారితోట, పాలకమ్మ చెరువు తదితర ప్రాంతాల్లో మంచి నీటి చెరువులకు తాగునీరందేలా పంట బోదెలు తవ్వుతున్నారు. మంగళవారం మండలంలోని మోడి గ్రామంలో సుమారు 3 కిలో మీటర్ల మేర పంటబోదె తవ్వకం పనులు చేపట్టారు. ఈ పనులను టీఏ వెంకటేశ్వరరావు, జేఈ ఆనంద్‌లు పర్యవేక్షించారు.

గడ్డిని తగలబెట్టడంతో భూమికి హాని


చేలల్లో ఎండుగడ్డిని తగులబెట్టిన దృశ్యం

నరసాపురం రూరల్: దాళ్వా వరి మాసూళ్ల అనంతరం రైతులు పంటచేలల్లో ఎండుగడ్డిని తగులబెట్టడం వల్ల భూమి పోషకాలను కోల్పోతుందని వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్‌కుమారి పేర్కొన్నారు. నరసాపురం మండలంలో సుమారు 12 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారని, ప్రస్తుతం యంత్రాలతో వరికోతలు కోస్తున్నార తెలిపారు. చేలల్లో ఉండిపోయిన వరిగడ్డిని తగులబెట్టడం వల్ల భూమి పోషకాలు కోల్పోవడంతో పాటు, పర్యావరణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. వేసవిలో చేలల్లో మంట పెట్టడంవల్ల భూమికి హాని జరగడంతోపాటు, పలు అగ్ని ప్రమాదాలకూ కరణమవుతుందని రైతులను హెచ్చరించారు.

పాలకొల్లులో పెరిగిన పోలింగ్


స్ట్రాంగ్ రూమ్ వద్ద జిల్లా కలెక్టర్, పరిశీలకురాలితో అధికారులు, పార్టీల ఏజెంట్లు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నియోజకవర్గంలో మొత్తం 1,95,057 మంది ఓటర్లలో 1,60,489 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 95,742 మందికి 79,802, మహిళల్లో 99,309 మందికి 80,684 మంది, ఇతరులు ఆరుగురికి ముగ్గురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 82.28 శాతం పోలింగ్ నమోదైంది. 2014లో 82.61 శాతం, 2019 ఎన్నికల్లో 81.43 శాతం పోల్ అవ్వగా నేడు 82.28 శాతం పోలింగ్ నమోదైంది. కొన్ని బూత్‌ల్లో ఓటర్లు అధికంగా ఉండడంతో రాత్రి 11 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. నాలుగైదు రూట్లలో బస్సుల్లో ఈవీఎంలను ఏపీఓలు ఈవీఎంలను భీమవరం తరలించారు. పాలకొల్లుకు సంబంధించిన ఈవీఎంలను విష్ణు కళాశాలలో ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎం దీప, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీల పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. పాలకొల్లు రిటర్నింగ్ ఆఫీసర్ బీఎస్ నారాయణరెడ్డి, తహసీల్దార్ పి.మధుసూదనరావు, ఎలక్షన్ డీటీ బెజవాడ సీతారత్నం, వివిధ పార్టీ నేతలు పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో వేంచేసియున్న సూర్యనారాయణ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు, మూలవిరాట్‌కు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో, ఫలరాసాలతోను విశేష అభిషేకాలు జరిగాయి. ఆవరణలోని పరివార దేవతలకు పూజలు చేశారు. ప్రధాన పురోహితులు సత్యనారాయణ శర్మ, తరుణ్ శర్మలు బ్రహ్మత్వం వహించారు.


పూలపల్లిలో ధాన్యం పట్టుబడి పడుతున్న కూలీలు


లంకలకోడేరులో మిల్లుకి తరలించేందుకు సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు


లంకలకోడేరులో ట్రాక్టర్‌లోకి ఎగుమతి చేస్తున్న ధాన్యం బస్తాలు →

శరవేగంగా ధాన్యం సేకరణ

- ఆశాజనకంగా దిగుబడులు
- పాలకొల్లు నియోజకవర్గంలో 60 శాతం సేకరణ
- ఎకరానికి 50 నుంచి 60 బస్తాల దిగుబడులు

పాలకొల్లు అర్బన్: దాళ్వా పంట దిగుబడి రైతులకు ఆనందాన్నిచ్చింది. ఎకరానికి 50 నుంచి 60 బస్తాల దిగుబడి రావడంతో రైతుల ఉత్సాహం రెట్టింపు అయ్యింది. పాలకొల్లు నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో దాళ్వా వరి మాసూళ్లు పూర్తికావచ్చాయి. ధాన్యం పట్టుబడిలో రైతులు నిమగ్నమయ్యారు. ఎన్నికల నేపథ్యంలో కొందరు రైతులు దాళ్వా ధాన్యాన్ని రాసులు చేశారు. ఎన్నికలు పూర్తికావడంతో ప్రస్తుతం పట్టుబడిపట్టి మిల్లులకు తరలిస్తున్నారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల, తిల్లపూడి, దగ్గులూరు, బల్లిపాడు, లంకలకోడేరు, అరట్లకట్ట, వెంకటాపురం కాపవరం, వాలమర్రు గ్రామాల్లో ఎకరానికి 50 నుంచి 60 బస్తాల దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. పెదమామిడిపల్లి, దిగమర్రు, కొత్తపేట, సగంచెరువు, ఆగర్రు, ఆగర్తిపాలెం, వెలివెల గ్రామాల్లో 45 నుంచి 50 బస్తాల దిగుబడి వచ్చిందంటున్నారు. ఎ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, కామన్ రకానికి రూ.2,183 చెల్లిస్తున్నారు.

మండలం	భూమి ఎకరాల్లో	రైతులు	ధాన్యం సేకరణ శాతం
పాలకొల్లు	9,500	5,800	60
యలమంచిలి	6,800	3,600	50
పోడూరు	14,000	9,230	70


భగ్గేశ్వరంలో కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం

ధాన్యం పట్టుబడి పడుతున్నా..



నేను శివదేవునిచిక్కాలలో ఐదెకరాల భూమి కౌలుకి సాగు చేస్తున్నాను. ఈ ఏడాది దిగుబడి బాగా వచ్చింది. ఎకరినికి 50 బస్తాలు పండింది. దాళ్వా సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాన. ఎరువులు, నీరు సమయానికి అందించారు. పంటకు ఏ విధమైన తెగుళ్ల రాకుండా జాగ్రత్తలు పాటించాను. దీంతో పంట దిగుబడి బాగా పెరిగింది. ప్రస్తుతం ధాన్యం పట్టుబడి పడుతున్నాను.

– తండా ఇస్సాక్‌రాజు, కౌలురైతు, శివదేవునిచిక్కాల, పాలకొల్లు మండలం

గిట్టుబాటు ధర దక్కింది



నాకు ఐదెకరాల పొలం ఉంది. దాళ్వాలో పంట దిగుబడి బాగా వచ్చింది. ఎకరానికి 54 బస్తాలు చొప్పున పండించాను. ప్రభుత్వం ధాన్యం సేకరణలో మంచి మార్పులు తీసుకొచ్చింది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభించింది. రవాణా, హమాలీ చార్జీలు, గోనె సంచులు ప్రభుత్వమే సరఫరా చేయడంతో నాకు లాభం చేకూరింది. మిల్లుకి ధాన్యం తోలుకుని వారం రోజుల్లో డబ్బులు నా ఖాతాకి జమయ్యాయి.

– వేగేశ్న రామకృష్ణంరాజు, రైతు, శివదేవునిచిక్కాల, పాలకొల్లు మండలం

ధాన్యం 60 శాతం సేకరించాం



పాలకొల్లు మండలంలోని 60 శాతం ధాన్యం సేకరణ పూర్తయింది. పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. మిగిలిన 40 శాతం పట్టుబడి చేసుకోవాలని రైతులను ప్రోత్సహిస్తున్నాం. వారం రోజుల్లో నూరుశాతం ధాన్యం సేకరణ పూర్తి చేస్తాం.

– ఎం సామ్యూల్ జాన్సన్, వ్యవసాయాధికారి, పాలకొల్లు

అభివృద్ధి, సంక్షేమానికే పట్టం


మేకా శేషుబాబు

పాలకొల్లు సెంట్రల్: సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ సరళి పూర్తయిన తరువాత పాలకొల్లు నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారనే విషయం స్పష్టంగా తెలుస్తోందని మాజీ ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు అన్నారు. మంగళవారం పోలింగ్ సరళి పరిశీలించిన అనంతరం శేషుబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో 82.28 శాతం ఓట్లు పోలవడం వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలికిందని చెప్పారు. వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించనుందని తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలు అందుకున్న ఆయా కుటుంబాల్లో ముఖ్యంగా మహిళలు ఏకపక్షంగా తీర్పు ఇస్తారని జోస్యం చెప్పారు. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేసి వచ్చిన ప్రతి ఓటర్లో జగనన్న భరోసా కనిపించిందన్నారు. జూన్ 4వ తేదీన వెలువడనున్న పోలింగ్ ఫలితాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్రవ్యాప్తంగా విజయ బావుటా ఎగురవేస్తుందని శేషుబాబు ధీమా వ్యక్తం చేశారు.

ఆచంటలో వైఎస్సార్ సీపీదే విజయం

ఆచంట అసెంబ్లీ అభ్యర్థి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీదే విజయమని, రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి అధికారం చేపట్టబోతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలోని తన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు వైఎస్సార్ సీపీకి నీరాజనం పట్టారన్నారు. ఓటింగ్ సరళి తమకే అనుకూలంగా ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఉన్నట్టు సమాచారం ఉందన్నారు. రాష్ట్రంలో పేదలకు పెత్తందార్లకు పోటీ అని సీఎం జగన్ చెప్పినట్లే, నియోజకవర్గంలో తాను ఆర్థికంగా బలంగా ఉన్నా, కార్యకర్తలు, నాయకులు అందరూ పేదలేనని, వీరంతా పెత్తందార్లుగా వ్యవహరించిన టీడీపీ కార్యకర్తలతో పోటీ పడ్డారని వివరించారు. నామినేషన్ల నాటి నుంచి ఎన్నో కయుక్తులు, దుష్ప్రచారాలు, బురద చల్లటమే కూటమి నాయకుల పని పెట్టుకొన్నారని విమర్శించారు. ప్రజలకు ఏమి చేస్తామో చెప్పకుండా నిత్యం బురదచల్లుడుకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. వీరితో పాటు ఎంపీ అభ్యర్థి శ్రీనివాస వర్మను తోడు పెట్టుకొన్నారన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా పేదలందరూ వైఎస్సార్ సీపీకి అండగా నిలిచారని చెప్పారు. గత మెజార్టీని మించి విజయం సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా మహిళలు దీవెనలు వైఎస్సార్ సీపీకి మెండుగా ఉన్నాయని, టీడీపీ నాయకుల కలలు కల్లలుగానే మిగిలిపోతున్నాయని అన్నారు. లేని ఉత్సాహం తెచ్చుకొని ప్రచారం చేసుకొంటున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతోందని, మరో ఐదేళ్ల పాటు ఆచంట ప్రజలకు అండగా నిలవనున్నామని చెప్పారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరంగనాథరాజు

నేడు సుహాసినీల కుంకుమార్చనలు

పెనుగొండ: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాల్లో భాగంగా బుధవారం సుహాసినీలచే సామూహిక కుంకుమార్చనల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశా రు. ఉదయం నుంచి నగరేశ్వరస్వామికి అభిషేకంలు, మహిషాసురమర్ధని, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లకు పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9 గంటల నుంచి సుహాసినీలచే సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు.

నరసాపురంలో 84.38 శాతం పోలింగ్

నరసాపురం: నరసాపురం నియోజకవర్గంలో మొత్తం 84.38 శాతం ఓట్లు పోలయ్యాయి. సోమవారం రాత్రి వరకు చాలా కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. ఫనల్ ఓట్లు నమోదు వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ మంగళవారం విడుదల చేశారు. నియోజకవర్గంలో మొత్తం 1,70,448 ఓట్లు ఉండగా, 1,43,825 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 72,598, మహిళలు 71227 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గానికి సంబంధించి మహిళల కంటే పురుషులే అధికంగా ఓట్లు వేయడం గమనార్హం.

వెంకమ్మ జాతర ఉత్సవాలు


పూరి గుడిసెలో గ్రామ దేవత వెంకమ్మవారు

యలమంచిలి: మేడపాడు గ్రామ దేవత వెంకమ్మ జాతర ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. జాతర ఉత్సవాలలో భాగంగా ఈ నెల 10వ తేదీన అమ్మవారిని మంగళ వాయిద్యాల మధ్య పుట్టింటికి తీసుకొచ్చారు. అప్పటి నుంచి పుట్టింటి వద్ద పూరి గుడిసెలో అమ్మవారికి నిత్య నైవేద్యం సమర్పిస్తున్నారు. ఈ నెల 26వ తేదీన అమ్మవారికి జాతర నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారు ఆలయ ప్రవేశం చేస్తారు. అప్పటి నుంచి ఐదు రోజులపాటు తీర్థ ఉత్సవాలు జరుగుతాయి. చివరి రోజున మాంసాహారంతో అన్నసమారాధన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

గర్భిణులపై పూర్తి శ్రద్ధ వహించాలి

పెంటపాడు: ఆరోగ్యకరమైన పండంటి బిడ్డకు జన్మనిచ్చేందుకు గర్భిణులు ప్రత్యేక శ్రద్ధలు తీసుకోవాలని, వారి ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక అవగాహన కల్పించాలని ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పూజిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు గర్భిణీలకు సంబంధించి కిల్కారీ మోబైల్ సేవలపై ఆమె అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్యశాఖలో పని చేసే కిల్కారీ మెబైల్ సేవల వల్ల గర్భిణులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నాలుగు నెలల నుంచి బిడ్డ పుట్టే వరకు, అనంతరం చంటిబిడ్డ ఏడాది వయస్సువచ్చేవరకు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో క్షుణ్ణంగా వివరించారు. ఆశా కార్యకర్తలు కిల్కారీ మొబైల్ అకాడమీ నుంచి కోర్సును పూర్తి చేసి పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. పీహెచ్ఎన్ టీవీ ప్రసన్న, సూపర్‌వైజర్ కె. మోహనరావు, ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన కోవెల ఉత్సవాలు


ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామివార్లకు పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: దాదాపు 23 రోజుల క్రితం ప్రారంభమైన శ్రీ ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామివారి దేవస్థానం ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గత నెల 22వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు మే నెల 2తో ముగిశాయి. అనంతరం 3వ తేదీ నుంచి మంగళవారం వరకు వార్షిక తిరునక్షత్ర ఉత్సవాలు నిర్వహించారు. మంగళవారం శ్రీభూదేవి సమేత ఆదికేశవస్వామివారికి, వడయవర్లకు మణవాళ మామునులకు అలంకార తిరుమంజనం, తీర్థప్రసాద గోష్టి చేశారు. సాయంత్రం 6 గంటలకు అగ్రహారోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆదికేశవ, ఎంబెరు మానార్ స్వామివార్లను మాడవీధుల్లో ఊరేగించారు. హంస వాహనంతో తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యులు కె.వెంకటాచార్యులు, అధ్యాపకస్వామి ముడుంబై మోహన నర్సింహాచార్యులు, అర్చకులు సుదర్శనం శేషాచార్యులు, పెద్దింటి మోహన రామాచార్యులు, శ్రీనివాసుల జగన్నాథాచార్యులు, శ్రీనివాసుల రామకృష్ణ, తళిహాస్వామి ఏవీవీఆర్ రామానుజాచార్లు తదితరులను ఆలయ ఫౌండర్ ట్రస్టీ పుప్పాల ఆదినారాయణ, కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్‌నాయుడు ఘనంగా సత్కరించారు.

గూడెంలో భారీ వర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గాలివాన బీభత్సానికి తాడేపల్లిగూడెం పలుచోట్ల వృక్షాలు నేలకు ఒరిగాయి. మంగళవారం సాయంత్రం గంట సేపు సంభవించిన గాలివాన గ్రామస్తుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. రోడ్లపైకి డ్రెయినేజీలోని నీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఓటింగ్‌లో అతివలదే హవా


ఆచంట నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల వద్ద భారులు తీరిన మహిళలు (ఫైల్)

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో మహిళలు అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉదయం 6 గంటల నుంచే మహిళలు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరడం విశేషం. ఇదే సరళి పోలింగ్ ముగిసే వరకూ కొనసాగింది. నియోజకవర్గంలో 1,80,017 మంది ఓటర్లలో 88,881 మంది పురుషులు, నలుగురు ట్రాన్స్ జెండర్స్, 91,132 మంది మహిళలు ఉన్నారు. ఉదయం 10 గంటలకు ఓటింగ్ శాతం తక్కువగా నమోదైనా పోలింగ్ ముగిసేసరికి 82.80 ఓటింగ్ శాతంతో నర్సాపురం పార్లమెంటు పరిధిలో మూడో స్థానంలో నిలిచింది. ఉండి నియోజకవర్గం 86.20 శాతం, నర్సాపురం నియోజకవర్గం 84.38 శాతం సాధించి మొదటి రెండుస్థానాల్లో నిలిచాయి. కాగా, ఆచంట నియోజకవర్గంలో పురుషులు 73,024 మంది, 76,022 మంది మహిళలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. దాదాపుగా మూడు వేల మంది ఓటు హక్కును అధికంగా వినియోగించుకొన్నారు.

ఓటింగ్ సరళి వైఎస్సార్ సీపీకి అనుకూలం

ఆచంట నియోజకవర్గంలో జరిగిన ఓటింగ్ సరళి వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉంది. మహిళలు సైతం వైఎస్సార్ సీపీకే ఎక్కువగా ఉందని భావిస్తున్నారు. దీనికితోడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉండే బూత్‌లలోనూ ఓటింగ్ శాతం అధికంగా ఉండడంతో వైఎస్సార్ సీపీ విజయం నల్లేరుపై నడకేనని అభిప్రాయం వ్యక్తమవుతోంది. పేదలకు అనేక సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడంతో బడుగు, బలహీన, దళిత వర్గాలు అధికంగా ఉండే బూత్‌లో పోలింగ్ ఎక్కువగా నమోదైంది. దీంతో జిల్లాలో తొలివిజయం సాధించే నియోజకవర్గంగా ఆచంట నిలవనుంది. ఈనేపథ్యంలో వైఎస్సార్ సీపీలో నూతనోత్సాహం నెలకొంది.

వేసవి ప్రతాపం.. ప్రజల విలాపం


చించినాడ వద్ద నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి


నిర్మాణుష్యంగా మారిన జాతీయ రహదారి

యలమంచిలి : వేసవి ఎండలు తీవ్ర ప్రతాపం చూపుతున్నాయి. ప్రజలు ఉదయం 10 దాటితే ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే విలపిస్తున్నారు. వేసవి ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతుండటంతో పగలు, రాత్రి అనే తేడాలేకుండా ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సూర్య ప్రతాపానికి ఉదయం 11 దాటితే రోడ్లపై జనసంచారంలేక నిర్మానుష్యమవుతున్నాయి. సాయంత్రం ఐదు దాటిన తరువాత వాతావరణం కొంత చల్లపడడంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. అక్కడక్కడా చెదురుమదురుగా వర్షాలు పడుతున్నా పగటి ఉష్ణోగ్రతలు మాత్రం ఎక్కడా తగ్గడం లేదు. మధ్యాహ్న సమయంలో రోడ్లన్నీ కర్ఫ్యూని తలపిస్తున్నాయి. ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఇళ్లలో నుంచి బయటకు వస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే చించినాడ జాతీయ రహదారిపై కూడా అడపాదడపా మాత్రమే వాహనాలు తిరుగుతున్నాయి.

వ్యాపారాలు అంతత మాత్రమే

ఎండల తీవ్రత నేపథ్యంలో వ్యాపారాలు సరిగ్గా జరగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ముఖ్యంగా ఎండాకాలంలో కూల్‌డ్రింక్స్ షాపులు, జ్యూస్ సెంటర్‌లకు మంచి గిరాకీ ఉంటుంది. అయితే ఎండల తీవ్రతకు మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు రాకపోవడంతో బేరాలు ఉండడం లేదని మేడపాడుకు చెందిన కూల్‌డ్రింక్ షాప్ యజమాని ముద్దల సత్యనారాయణ తెలిపారు. జాతీయ రహదారి పక్కన బళ్లపై పళ్ల రసాలు అమ్మే చిరు వ్యాపారులు సైతం ఎండను లెక్కచేయకుండా రోడ్డు పక్కన నిల్చున్న బేరాలు రావడం లేదని వాపోతున్నారు.

వడగాలులతో జాగ్రత్త



అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో బయట తిరగకపోవడమే మంచిది. తప్పనిసరయితే హెల్మెట్, టోపీ, గొడుగు ధరించి వెళ్లాలి. బయటకు వెళ్లేవారు చమట, వేడి వల్ల డీహైడ్రేషన్ బారిన పడకుండా మంచినీరు, గ్లూకోజ్ వాటర్, బార్లీ, సబ్జా నీరు బాటిళ్లలో తీసుకెళ్లి ఆరగారగా తాగాలి. ఓఆర్ఎస్ కూడా మంచిదే. వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులు మాత్రం ఇంటికే పరిమితమవ్వడం మంచిది.

– డాక్టర్ వర్ధనపు సుభాష్‌చంద్ర స్వరూప్

మండుతున్న ఎండలు

మొగల్తూరు: గత కొద్ది రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటలకే సూర్యుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు, వ్యవసాయ, ఉపాధి కూలీలు పనులు చేపట్టేందుకు ఇష్టపడటంలేదు. మంగళవారం ఉదయం నుంచే జాతీయ రహదారితో పాటు మొగల్తూరు గ్రామంలోని ప్రధాన రహదారులపై జన సంచారంలేక నిర్మాణుష్యంగా మారాయి. రైతులు తమ ధాన్యాన్ని జాతీయ రహదారిపై ఆరబెట్టుకుని ఒబ్బిడి చేసుకుంటున్నారు. రోహిణి కార్తె రాకముందే ఎండలు ఎక్కువుగా కాసే అవకాశం ఉండొచ్చనే వాతావరణ శాఖ సమాచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.